'టీటీడీ'లో తెలంగాణ వాటా కోరితే

'హైదరాబాద్'లో వాటా ఏపీకివ్వాలి

- సీఎంల సమావేశ వివరాలు వెల్లడించాలి
- చంద్రబాబు రూపంలో ఏపీకి పాపం
- మీడియాలో ప్రచారం తప్ప చేసేదేమీ లేదు
- గ్రామాలను తెలంగాణలో కలిపితే మళ్లీ సమస్య
- వైసీపీ నేతలు కాకాణి, విజయసాయిరెడ్డి

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఏం చర్చించారో ప్రజలకు చెప్పాలని, టీటీడీ ఆస్తుల్లో తెలంగాణ వాటా కోరినట్టయితే హైదరాబాద్ ఆదాయంలో ఏపీకి వాటా ఇవ్వాలని వైసీపీ నేతలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చర్చించిన విషయాలను ఏపీ ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందని, ఈ విషయంపై కూటమిలో ఉన్న మూడు పార్టీలు సమాధానం చెప్పాలని, ఏపీ నుంచి పోలవరం ముంపు మండలాలు, ఓడరేవులు, టీటీడీ ఆస్తుల్లో తెలంగాణ వాటా కోరినట్టు వస్తున్న వార్తల్లో నిజమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు రూపంలో ఏపీకి పాపం తగిలిందని మండిపడ్డారు. రాష్ట్ర విభజనకు కారణం చంద్రబాబే నని, ఓటుకు నోటు కేసులో దొరికిపోయి పారిపోయి ఏపీకి వచ్చారని, ఏపీ ఆస్తులను వదిలేసి ఎందుకు పారిపోయి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్నీ ఆరంభ శూరత్వాలేనని, అనుకూల మీడియాలో ప్రచారం తప్ప సాధించిన ఫలితాలు ఏమీ లేవని ఎద్దేవాచేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఏ అంశాలకు పరిష్కారం లభించిందనే విషయాన్ని వెల్లడించలేదని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక ఆర్కిటెక్ట్ మాదిరిగా చంద్రబాబును రేవంత్‌రెడ్డి పిలిచినట్టుందని కాకాణి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రుల సమావేశానికి దశ, దిశ లేదని, పరస్పర డబ్బా తప్ప సాధించిందేమీ లేదని విమర్శించారు. 9 ఏండ్లు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పోలవరం గురించి ఏనాడూ ఆలోచించలేదని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ముంపు మండలాల్లోని గ్రామాలను తెలంగాణలో విలీనం చేస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తుందని తెలిపారు. టీటీడీలో కూడా తెలంగాణ వాటా అడిగినట్టు సమాచారం వచ్చిందని, దీన్ని మంత్రులు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. 9,10వ షెడ్యూల్ కింద రావాల్సిన ఆస్తులు ఎన్నో ఉన్నాయని, వీటిపై చంద్రబాబు స్పందించలేదని విజయసాయిరెడ్డి విమర్శించారు.

పోలవరం ముంపు గ్రామాలన్నీ ఏపీకే చెందుతాయి

- ఆ 7 మండలాలపై మాట్లాడేవారు చరిత్ర తెలుసుకోవాలి
- 'హోదా' సాధన సమితి అధ్యక్షుడు చలసాని వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని 7 మండలాలను ఏపీలో విలీనం చేసిన వివాదంపై ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 7 మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారని మాట్లాడేవాళ్లు చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. పోలవరం ముంపు గ్రామాలన్నీ ఏపీకే చెందుతాయని స్పష్టం చేశారు. ఇది రీఆర్గనైజేషన్ యాక్టులోనే ఉన్నదని పేర్కొన్నారు. ఏపీపై ఎన్డీయే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నదని ఆరోపించారు. తెలంగాణ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలు, విభేదాలు ఉంటే న్యాయ నిపుణులతో కమిటీలు వేయాలని సూచించారు. ఆస్తుల పంపకాల విషయంలో పంతాలకు పోవద్దని హితవు పలికారు. తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర విభజనకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఏపీ-తెలంగాణ మధ్య నెలకొన్న వివాదాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో గుజరాత్‌ను మించిన తెలంగాణ

తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ 1

- విభజన సమయంలో ఏపీ, తెలంగాణ మధ్య తలసరి ఆదాయంలో 35% వ్యత్యాసం
- పదేండ్లలో 44 శాతానికి పెరిగిన గ్యాప్
- టీడీపీ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధికి బాటలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అభివృద్ధిని కొనసాగించాయి
- తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెస్తాం
- రెండు తెలుగు రాష్ట్రాలు నాకు రెండు కండ్లు
- ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో టీటీడీపీ నేతలతో చంద్రబాబు

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నదని టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. పెద్ద రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక కంటే తెలంగాణ తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నదని వివరించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కొనసాగించాయని, ఇందుకు ఆ పార్టీలను అభినందిస్తున్నానని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆదివారం ఆయన తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3 లక్షలు ఉంటే, ఏపీ తలసరి ఆదాయం రూ.2 లక్షలుగా ఉన్నదని చెప్పారు. తలసరి ఆదాయం రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి, తెలంగాణకు మధ్య 35% వ్యత్యాసం ఉండేదని, ఇప్పుడు 44 శాతానికి పెరిగిందని వివరించారు. తన హయాంలోనే ఔటర్ రింగురోడ్డు, ఎయిర్‌పోర్ట్‌లను ప్రతిపాదన చేసి ప్రారంభించామని తెలిపారు. నేడు నాలెడ్జ్ ఎకానమీకి హైదరాబాద్ చిరునామాగా మారిందని పేర్కొన్నారు. తన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభివృద్ధిని కొనసాగించాయని చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు పరిష్కరించుకుందామని తానే రేవంత్‌రెడ్డికి లేఖ రాశానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసి ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. రెండు రాష్ట్రాలు గొడవలు పెట్టుకుంటే నీళ్లు రావని, సమస్యలు పరిష్కారం కావని, అభివృద్ధి జరగదని హెచ్చరించారు. తెలుగు రాష్ట్రాలు తనకు రెండు కండ్లు అని వ్యాఖ్యానించారు. దేశానికి దశదిశను చూపిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావును గుర్తుచేసుకున్న చంద్రబాబు.. ఆర్థిక సంస్కరణలు అమలు, సంపద సృష్టి ఆయన కాలంలోనే ప్రారంభమైందని చెప్పారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెస్తా

టీడీపీకి తెలంగాణలో మళ్లీ పూర్వ వైభవం తెస్తామని చంద్రబాబు చెప్పారు. తెలుగుజాతి ఉన్నంతవరకు తెలుగుదేశం జెండా ఈ ప్రాంతంపై రెపరెపలాడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ, ఏపీ తనకు రెండు కండ్లు లాంటివని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల ప్రయోజనాలే లక్ష్యంగా టీడీపీ పని చేస్తుందని హామీ ఇచ్చారు. తెలుగుజాతి ఐకమత్యంగా ఉండాలనే ఆలోచించానని, చివరి రక్తం బొట్టు వరకూ తెలుగుజాతి కోసం పనిచేస్తానని చెప్పారు. తనతోపాటు నాయకులను అనేక ఇబ్బందులు పెట్టినా తిరుగులేని శక్తిగా ఎదిగామని, తనను జైల్లో పెట్టినప్పుడు హైదరాబాద్‌లో టీడీపీ కార్యకర్తలు చూపించిన సంఘీభావం మర్చిపోలేనని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా చేశానని, తన రికార్డును ఎవరూ బ్రేక్ చేయలేరని చెప్పారు. వచ్చే 30 ఏండ్లలో తెలుగు రాష్ట్రాలు ఎలా ఉంటాయో ఇప్పుడే ఒక విజన్ ఆలోచిస్తానని తెలిపారు.

చంద్రబాబు నోట 'జై తెలంగాణ'

చంద్రబాబు 'జై తెలంగాణ' అని నినదించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రసంగం అనంతరం 'జై హింద్.. జై తెలుగుదేశం.. జై తెలంగాణ' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. ఉద్యమ సమయంలో అడుగడుగునా రాష్ట్ర ఏర్పాటును అడ్డుకోవడంతోపాటు తన హయాంలో తెలంగాణ పదాన్నే నిషేధించిన బాబు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో తొలిసారిగా 'జై తెలంగాణ' నినాదం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ పార్టీని బలోపేతం చేయాలనుకున్న బాబు పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నమ్మకం కల్గించేందుకే ఈ నినాదం చేశారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

చంద్రబాబుతో తుమ్మల కరచాలనం

ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన మంత్రి తుమ్మల

జాతీయ రహదారులు, రైల్వే లైన్లపై చర్చ

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారులు, జలవనరులు, రైల్వేలైన్లు, పట్టిసీమ నుంచి ప్రకాశం బరాజ్‌కు అక్కడ నుంచి పులిచింతల, నాగార్జునసాగర్‌కు గోదావరి జలాల తరలింపుపై చర్చించారు. పట్టిసీమ టు పులిచింతల లింక్‌తో రాయలసీమ సాగునీటి కష్టాలు తీరుతాయని, తెలంగాణకు మేలు జరుగుతుందని, సత్తుపల్లి నుంచి కోవూరు రైల్వేలైన్, పెనుబల్లి నుంచి కొండపల్లి రైల్వేలైన్ పనులు పూర్తయితే రెండు రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని తుమ్మల సూచించారు. భద్రాచలంలోని ఐదు గ్రామాల విలీనంపై చంద్రబాబుకు మంత్రి వివరించారు.

ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఉద్యమం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం సీపీఐ ఉద్యమం చేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి సమస్యల పరిష్కారం కోసం కొంత సమయం ఇవ్వాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం విజయవాడలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణతో కలిసి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న విభజన సమస్యల పరిష్కారానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమవడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. బీహార్ సీఎం నితీశ్‌కుమార్, ఏపీ సీఎం చంద్రబాబు మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నదని, వీరు ప్లేట్ ఫిరాయించకుండా మోదీ పట్టుకున్నారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్నమాదిగ

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి

రవీంద్రభారతి, జూలై 7 : ఎస్సీ వర్గీకరణ బిల్లును తక్షణమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మాదిగ దండోర ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, విమలక్క విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పలువురు మాదిగ పోరాటయోధులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణతోనే మాదిగలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న మాదిగ మాట్లాడుతూ.. 30 ఏండ్ల మాదిగల పోరాటంలో ఎందరో అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. లేకుంటే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

కేంద్రం మోసంవల్లే వర్గీకరణలో జాప్యం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ
- ఇందిరాపార్కు వద్ద వర్గీకరణ సాధనకు దీక్ష

దీక్షలో వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

చిక్కడపల్లి, జూలై 7: కేంద్రం మోసం వల్లే వర్గీకరణలో జాప్యం జరుగుతుందని, బీజేపీ ప్రభుత్వం వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి పదేండ్లు దాటినా ఇంత వరకు నెరవేర్చలేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ధ్వజమెత్తారు. ఆదివారం ఇందిరాపార్కు వద్ద ఎస్సీ వర్గీకరణ సాధనకోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ప్రజాగాయని విమలక్క దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వంగపల్లి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరాటం ప్రారంభమై 30 సంవత్సరాలవుతున్నా పరిష్కారం కాలేదన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులు రేవంత్, చంద్రబాబు సమావేశమైనా వర్గీకరణ విషయం ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీవర్గీరణ డిమాండ్‌కు బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, మాదిగ జర్నలిస్టుల సంఘం నేత నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మటన్ తెచ్చినందుకు లొల్లి

భర్త ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

దుండిగల్, జూలై 7 : మటన్ విషయంలో భార్యతో గొడవపడిన భర్త చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా, పోలీసులు వెంటనే స్పందించి కాపాడారు. ఈ సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాచుపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన సాయిని నరేశ్, రాణి దంపతులు. నరేశ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, రాణి కూలికి వెళ్తుంది. ఆదివారం కావడంతో నరేశ్ మటన్ తీసుకొచ్చాడు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండగా, మటన్ ఎందుకు తెచ్చావని రాణి భర్తతో గొడవపడింది. దీంతో మనస్తాపం చెందిన నరేశ్ అక్కడి నుంచి నేరుగా సమీపంలోని బైరుని చెరువు వద్దకు వెళ్లాడు. నడుముకు పెద్దరాయి కట్టుకుని చెరువులోకి దిగుతుండగా స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వచ్చిన కానిస్టేబుల్ సత్యపాల్‌రెడ్డి చెరువులోకి దిగి నరేశ్‌ను కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. రాణిని సైతం పీఎస్‌కు పిలిపించి దంపతులిద్దరికి కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

సైబర్ నేరగాళ్ల చెరవీడి స్వదేశానికి

బయ్యారం, జూలై 7: ఉద్యోగం పేరుతో మోసపోయి సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి చిత్రహింసలు అనుభవించిన మహబూబాబాద్ జిల్లా వాసి ఎట్టకేలకు స్వదేశానికి చేరుకున్నాడు. బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన మున్సిఫ్ ప్రకాశ్ బీటెక్ పూర్తి చేసి మూడేండ్లు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగం కోసం మార్చి 8న ఆస్ట్రేలియా వెళ్లాడు. ఏజెన్సీ వారు మలేషియా, కాంబోడియాకు తీసుకెళ్లారు. అక్కడ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. వీడియోలు వైరల్‌గా మారాయి. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత కాంబోడియాలోని మిత్రుడు కిరణ్‌రెడ్డికి విషయం చెప్పి, ప్రకాశ్ స్వదేశానికి వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. దీంతో ప్రకాశ్ శనివారం రాత్రి కాంబోడియా నుంచి స్వదేశానికి చేరుకున్నాడు. వైద్య పరీక్షలు, మూడు రోజుల అబ్జర్వేషన్ తర్వాత ఢిల్లీ పోలీసులు ప్రకాశ్‌ను ఇంటికి పంపించనున్నట్టు సమాచారం. ప్రకాశ్ స్వదేశానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చశారు.

24 గంటల్లో నలుగురు రైతుల ఆత్మహత్య

- కాలం కలిసిరాలేదని ముగ్గురు..
- భూసమస్యతో మరొకరు బలవన్మరణం
- ఆత్మహత్యకు యత్నించి మరో ఇద్దరు దవాఖాన పాలు
- భద్రాద్రి, వరంగల్, జనగామ, ములుగు జిల్లాల్లో ఘటనలు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, జూలై 7 : కాలం కలిసి రాక.. అప్పులు తీర్చే మార్గం లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 24 గంటల్లోనే రాష్ట్రంలో నలుగురు రైతులు బలవన్మరణం చెందారు. వీరిలో ఒకరు భూసమస్య పరిష్కారం కావడం లేదనే మనస్తాపంతో ప్రాణాలు విడిచారు. ఆత్మహత్యకు యత్నించిన మరో ఇద్దరు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, జనగామ, ములుగు జిల్లాల్లో జరిగిన ఘటనల వివరాలు ఇలా..

గుబ్బెటితండాలో కౌలురైతు ఆత్మహత్య

కమలమ్మ (ఫైల్)

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని గుబ్బెటి తండా చెందిన బానోత్ రాంధాన్, కమలమ్మ దంపతులు 9 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశారు. రెండుసార్లు పత్తి గింజలు వేసినా మొలకెత్తలేదు. దీంతో రాంధాన్, కమలమ్మ (35) తీవ్ర మనోవేదనకు గురయ్యారు. భూమి దున్నడం, విత్తనాలు విత్తుకోవడానికి అప్పులు తెచ్చారు. విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడంతో అప్పులు మీదపడగా, మరోవైపు కుటుంబ పోషణ భారంగా మారింది. వీరి ఇద్దరు కుమారులు డిగ్రీ చదువుతున్నారు. వారి చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడతాయని మనోవేదనకు గురైన కమలమ్మ శనివారం పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆ కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి పరామర్శించారు.

అప్పులబాధ తాళలేక లక్ష్మయ్య..

లక్ష్మయ్య (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి జానకీపురంనకు చెందిన రైతు పిట్టల లక్ష్మయ్య(40) 3 ఎకరాలతోపాటు మరి కొంత భూమిని కౌలుకు తీసుకొని వరి, పత్తి, మిర్చి పండిస్తున్నాడు. పెట్టుబడికి కొంత అప్పు చేశాడు. పంటలు పండక దిగుబడి రాక పోవడంతో అప్పులు అధికమయ్యాయి. దానికితోడు తండ్రి వైద్యానికి , పిల్లల చదువుల కోసం మరికొంత అప్పులు చేయగా తడిసిమోపెడయ్యాయి. నెల రోజుల క్రితం తండ్రి మృతి చెందాడు. అప్పులు తీర్చే మార్గం లేక గ్రామ శివారులోని తన పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు పెనుబల్లి వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం లక్ష్మయ్య ఇంటికి వెళ్లి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

భూమి పట్టా కాలేదని..



వెంకటలక్ష్మి (ఫైల్)

కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఏళ్లుగా రెవెన్యూ అధికారులు, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని మహిళా రైతు ఆత్మహత్య చేసుకున్నది. జనగామ జిల్లా చిల్పూర్ మండలం కొండాపూర్‌కు చెందిన పసునూరి నరేందర్ రెడ్డి, అతడి తండ్రి లక్ష్మీనారాయణరెడ్డికి చెందిన రెండు ఎకరాల భూమిని మామ, అల్లుడు శివరాత్రి చిన్న బుచ్చయ్య, కుంచం కార్యవర్ది రాజు కలిసి చెరో ఎకరాన్ని 2011లో కొనుగోలు చేసి డబ్బులు చెల్లించారు. రూ.20 వేలు రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లిస్తామని పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన దేవేందర్ వీరికి మధ్యవర్తిగా ఉన్నాడు. 2011లో కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని నరేందర్‌రెడ్డిని కోరగా, భూమి తన తండ్రి పేరిట ఉన్నదని, చనిపోయిన తన తండ్రి పేరు నుంచి తన పేరు మీదికి రెండేళ్ల తర్వాత మారుతుందని, అప్పుడు రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మబలికాడు. 2014లో తన పేరు పైకి రాగానే భూముల ధరలు పెరగడంతో అధిక డబ్బులకు ఆశపడి గోవిందరావుపేట, బుసాపూర్‌కు చెందిన గుండ్రెడ్డి వినోదకు అదే భూమిని అమ్మి రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో మొదట కొనుగోలు చేసిన శివరాత్రి చిన్న బుచ్చయ్య, కుంచం కార్యవర్ది రాజు మోసపోయామని గుర్తించి నరేందర్‌రెడ్డి, దేవేందర్‌ను నిలదీశారు. తమకు అమ్మినచోట కాకుండా వేరే చోట భూమి ఇస్తామని దేవేందర్‌రెడ్డి చెప్పగా, ఒప్పందం ప్రకారమే తమకు భూమి ఇవ్వాలని శివరాత్రి చిన్న బుచ్చయ్య, కుంచం కార్యవర్ది రాజు కోరారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని అప్పటి ఆర్డీవో ఎల్ రమేశ్‌ను ఆశ్రయించగా, వినోదకు పట్టాపాస్ బుక్ రాకుండా డిజిటల్ సిగ్నిచర్‌ను పెండింగ్‌లో పెట్టారు. శనివారం శివరాత్రి చిన్న రాజయ్య, అతడి భార్యతోపాటు కార్యవర్ది రాజు భార్య కుంచం వెంకటలక్ష్మి (35) మధ్యవర్తి దేవేందర్‌తో మాట్లాడారు. తమకు భూమి దక్కదని మనస్తాపానికి గురైన వెంకటలక్ష్మి ఆదివారం ఉదయం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం అనంతరం మధ్యవర్తి ఇంటి ఎదుట మృతదేహంతో బంధువులు, కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు.

భూసమస్యతో ఆత్మహత్యాయత్నం

భూ సమస్య పరిష్కారం కావడం లేదని ములుగు జిల్లాలో ఓ మహిళా రైతు ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన వాంకుడోత్ రాజమ్మ 2018లో అన్నంపల్లి శివారులో సర్వే నంబర్ 153లో 36 గుంటల భూమిని కంది వెలగొండారెడ్డి వద్ద కొనుగోలు చేసింది. ఆ భూమి ధరణి పోర్టల్‌లో సానికొమ్ము అంజిరెడ్డి పేరిట ఉన్నది. ఈ విషయమై స్థానిక పెద్దమనుషులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇరువురి అంగీకారంతో ప్రభుత్వ సర్వేయర్ ద్వారా ఈ నెల 4న కొలతలు వేయించగా, భూమి 153 సర్వే నంబర్‌దని తేలింది. సంబంధిత భూమిని అంజిరెడ్డి గ్రామ పెద్దల సమక్షంలో రాజమ్మ పేరు మీదకు మార్చుతానని అంగీకరించి మాట మార్చాడు. మనస్తాపానికి గురైన రాజమ్మ పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ములుగు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతున్నది.

పురుగుమందు తాగిన రైతు దంపతులు

సంతోష్ (ఫైల్)

అప్పుల బాధతో రైతు దంపతులు ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా భర్త మృతి చెందగా, భార్య చికిత్స పొందుతున్నది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం సోమయ్యకుంటతండాకు చెందిన కెతావత్ సంతోష్ (36), సరోజ దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వీరికున్న నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేస్తున్నారు. దీనికితోడు వరికోత యంత్రం, కారు, ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వరికోత యంత్రం, కారు, ఆటోకు సరిగ్గా కిరాయిలు దొరకక, వ్యవసాయం చేసినా ఆశించిన మేర దిగుబడి రాక అప్పులయ్యాయి. ఈ వానకాలంలో వరి వేసేందుకు దుక్కి సిద్ధం చేయడంతోపాటు నారు కూడా పోశారు. అదనుకు వానలు పడకపోవడంతో తమకున్న బోరు ద్వారా నీళ్లు పారిస్తున్నా అవి సరిపోవడం లేదు. ఆదివారం మరో బోరు వేస్తానని భార్య సరోజతో చెప్పడంతో మరింత అప్పు అవుతుందని ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన సరోజ భర్తను బెదిరించేందుకు కొద్దిగా పురుగుల మందుతాగింది. గమనించిన స్థానికులు, భర్త సంతోష్ జనగామ ఏరియా వైద్యశాలకు తరలించారు. సరోజ పరిస్థితి విషమంగా ఉన్నదని భావించిన సంతోష్ స్వగ్రామానికి వచ్చి, వ్యవసాయ బావి వద్ద పురుగు మందుతాగి, బెంగళూరులో ఉన్న తన తమ్ముడికి ఫోన్ చేసి చెప్పాడు. అతను వెంటనే గ్రామస్థులను అప్రమత్తం చేయడంతో వారు సంతోష్‌ను జనగామ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ బలవన్మరణం

- రైలు కింద పడి ఆత్మహత్య
- ఆటో నడవక ఆర్థిక ఇబ్బందులు
- కిస్తీలు కట్టాలని ఫైనాన్స్ సిబ్బంది వేధింపులు

నాగేంద్రబాబు (ఫైల్)

మిర్యాలగూడ/సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మరో ఆటో డ్రైవర్ మరణానికి కారణమైంది. ఆరు నెలలుగా ఆటోకు గిరాకీ లేక.. ఆటో ఫైనాన్స్‌కు ఈఎంఐ చెల్లించలేక ఆదివారం ఓ ఆటో డ్రైవర్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండ లం వెంకటాద్రిపాలెంలోని దుర్గానగర్‌కు చెంది న నాగేంద్రబాబు (32) ఆటో నడుపుతూ భా ర్య, ఇద్దరు కుమారులతోపాటు వృద్ధులైన తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆరు నెలలుగా ఆటోకు గిరాకీ లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఆటో కొనుగోలు కోసం అప్పు ఇచ్చిన ఫైనాన్స్ వారు కిస్తీలు కట్టాలని ఒత్తిడి చేశారు. కుటుంబాన్ని నడపలేక, ఆటో కిస్తీలు చెల్లించలేక మనస్తాపంతో నాగేంద్రబా బు ఆదివారం తెల్లవారుజామున మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని మృతదేహం నాగేంద్రబాబుదిగా గు ర్తించారు. ఉచిత బస్సు పథకం వల్ల వేలాది మంది ఆటో డ్రైవర్లు వీధిన పడ్డారని ఆటో మోటార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ నాజర్ అలీ మీర్జా ఆరోపించారు. నాగేంద్రబాబు మృతదేహాన్ని సందర్శించిన ఆయన.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది ఆటో డ్రైవర్లు మృతి చెందారని, మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇద్దరు మృతి చెందారని చెప్పారు. మృతిచెందిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేల భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తిరుమలలో భక్తుల రద్దీ

24 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు • 18 నుంచి కపిలేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం కోసం 24 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో సర్వదర్శనం కలుగుతున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. శనివారం స్వామివారిని 77,995 మంది భక్తులు దర్శించుకోగా, 30,250 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారి హుండీలకు రూ.3.72 కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 20 వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తొలిరోజు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ, రెండో రోజు గ్రంథి పవిత్ర సమర్పణ, యాగశాల పూజ, హోమం, 20న మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహించనున్నట్లు వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు 'మిషన్ లైఫ్'

ఇంధన ఆదాలో మనమూ పాలుపంచుకుందామా

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): ఈ భూమిపై జరిగే పరిణామాలన్నింటికి మానవులుగా మనమే కారకులం. మన అవసరాలు, అత్యాశలు భావితరాలకు తీవ్రమైన ముప్పును తెచ్చిపెడుతున్నాయి. మానవాళి అవసరాల కోసం ప్రకృతిని పణంగా పెట్టి తెచ్చుకున్న పారిశ్రామిక విప్లవం ఓవైపు మన అభివృద్ధికి, జీవన ప్రమాణాల పెంపునకు దోహదపడుతూనే మరోవైపు కాలుష్యాన్ని తెచ్చిపెట్టింది. ఫలితంగా వాతావరణంలో పెను మార్పులు సంభవించి ప్రకృతి వైపరీత్యాలతోపాటు మరెన్నో అనర్థాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మనం ఇంధన పొదుపు పద్ధతులను పాటించడంతోపాటు జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోగలిగితే పర్యావరణాన్ని, సమాజాన్ని రక్షించిన వారమవుతాం. ఇందుకోసం ఉద్దేశించిన కార్యక్రమమే 'మిషన్ లైఫ్'. దీని ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 307 బిలియన్ యూనిట్ల విద్యుత్తు, 24.68 మిలియన్ టన్నుల చమురును ఆదా చేయడంతోపాటు 306.40 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగాం. 2027-28 నాటికి దేశంలోని వంద కోట్ల మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) నడుం బిగించింది. ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నది.

ఇంధన ఆదా కోసం ఇలా చేద్దాం..

- ట్రాఫిక్ సిగ్నళ్లు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద కార్లు, ద్విచక్రవాహనాల ఇంజిన్లను ఆఫ్ చేయడం ద్వారా 22.5 బిలియన్ కిలోవాట్ల ఇంధనాన్ని ఆదాచేయవచ్చు.
- షాపింగ్‌కు బట్టసంచులను (క్లాత్ బ్యాగ్‌లను) వాడటం ద్వారా ఏటా 375 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో చేరకుండా నిరోధించవచ్చు.
- నల్లాలు, కులాయిలను సకాలంలో ఆపడం వల్ల 9 ట్రిలియన్ లీటర్ల నీటిని ఆదా చేయవచ్చు.
- పనికిరాని ఎలక్ట్రానిక్ ఉపకరణాలను రీసైకిల్ చేయడం ద్వారా 0.75 మిలియన్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నియంత్రించవచ్చు.
- ఏసీల్లో ఉష్ణోగ్రతను 24 డిగ్రీల వద్ద సెట్ చేసుకోవడం, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఇంధన పొదుపు మోడ్‌లో ఉంచడం, ఎల్ఈడీ బల్బులను ఉపయోగించడం, తక్కువ నీరు అవసరమయ్యే మినుము లాంటి పంటలను సాగు చేయడం, పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు.